సాక్షి కామారెడ్డి

గురువారం। 8। ఆగస్టు। 2024



రోడ్డు భద్రతపై అవగాహన
విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని జాతీయ రహదారి ఇన్సిడెంట్ మేనేజర్ ప్రతాప్ సింగ్ అన్నారు.
- 8లో ▸



తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం
జిల్లాలో తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. తల్లిపాల ప్రాముఖ్యతపై అధికారులు అవగాహన కల్పించారు.
- 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31.6 /22.9
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

కామారెడ్డి క్రైం: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించడానికి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 9న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మధుసూదన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని ఐసీఐసీఐ బ్యాంక్‌లో పలు పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఎంపికైన వారికి రూ.14 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. 25 నుంచి 35 ఏళ్లలోపు వారు ధ్రువపత్రాలతో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9848237987, 7671974009 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రేషన్‌డీలర్ల భర్తీకి రేపు పరీక్ష

కామారెడ్డి రూరల్: కామారెడ్డి డివిజన్ పరిధిలోని గ్రామాల్లో ఖాళీగా ఉన్న 34 రేషన్ డీలర్ల భర్తీ కోసం 393 దరఖాస్తులు వచ్చాయని కామారెడ్డి ఆర్డీవో రంగనాథ్ తెలిపారు. ఈ నెల 9న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు వీరికి కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు గమనించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు



కామారెడ్డి అర్బన్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో రెండు స్వర్ణ, ఒక కాంస్య పతకం సాధించినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్ రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు. అండర్-14 వంద మీటర్ల పరుగులో కె ప్రవీణ్ బంగారు పతకం, అండర్- 18 జావెలిన్ త్రోలో బి ఈశ్వర్ బంగారు పతకం సాధించగా, అండర్-14 400 మీ. పరుగులో ఎన్ శ్రీను కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

కామారెడ్డి క్రైం: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సింధుశర్మ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. విద్యాసంస్థలు, ఇతర ప్రాంతాల్లో గానీ ర్యాగింగ్‌కు పాల్పడటం నేరమన్నారు. ఫ్రెషర్స్ పార్టీలు, వెల్‌కమ్ పార్టీల పేరిట సీనియర్‌లు, జూనియర్‌లు అంటూ కళాశాలల్లో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన ఘటనలు గతంలో వెలుగు చూశాయన్నారు. మరోసారి అలాంటివి జరిగితే సహించేది లేదన్నారు. ఎవరైనా ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే డయల్100కు లేదా 8712686094 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఎర్రకోటలో పంద్రాగస్ట్ వేడుకలకు ఆహ్వానం



విజయశాంతి



జ్యోతి

సదాశివనగర్: ఢిల్లీలోని ఎర్రకోటలో నిర్వహించే పంద్రాగస్టు వేడుకలకు సదాశివనగర్ మండలం మర్కల్ మహిళా గురుకుల డిగ్రీ కాలేజీ విద్యార్థులకు ఆహ్వానం వచ్చినట్లు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఫైనలియర్ విద్యార్థులు విజయశాంతి, జ్యోతికి ఆహ్వానం వచ్చిందని పేర్కొన్నారు. వీరు ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా మేరీ మిట్టి-మేరా దేశ్ కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషించడంతో ఎంపికయ్యారని తెలిపారు.

కలెక్టర్ పేరుతో సైబర్ నేరగాళ్ల ఫోన్లు

కామారెడ్డి క్రైం : సైబర్ నేరగాళ్లు మితిమీరిపోతున్నారు. ఏకంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేరు, ఫొటోలను వాడుకొని నకిలీ వాట్సాప్ ప్రొఫైల్ తయారు చేయడమే కాకుండా కొందరు జిల్లా స్థాయి అధికారులకు, తెలిసిన వారికి ఫోన్ కాల్స్ వాయిస్ కాల్స్, మెసేజ్‌లు చేస్తున్నారు. డబ్బులు అవసరం ఉన్నాయి, తాను చెప్పిన అకౌంట్‌కు పంపాలని అంటూ సైబర్ నేరగాళ్లు మెసేజ్‌లు, కొన్ని సందర్భాల్లో కలెక్టర్ డీపీతో వాయిస్ కాల్స్ చేస్తుండడంతో కలెక్టరేట్ ఏవో మస్రూర్ అహ్మద్ బుధవారం సాయంత్రం దేవునిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

జాగా కనిపిస్తే పాగా!



కామారెడ్డిలోని గాంధీనగర్‌లో రెండు వందల గజాల ప్లాటును కలిమెల్ల రాజయ్య అనే వ్యక్తి 2002లో కొనుగోలు చేశారు. కొంతకాలానికి ఆయన చనిపోవడంతో ఆ ప్లాటుపై వీక్లీ మార్కెట్‌కు చెందిన మారం శ్రీనివాస్ అనే వ్యక్తి కన్నేశాడు. ప్లాట్ యజమాని కొడుకు మహేందర్ పేరుతో ఆరేటి గంగాధర్ అనే వ్యక్తిని చూయించి రాజయ్య పేరుపై ఉన్న ప్లాటును తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తర్వాత ఆ ప్లాటును వేరే వ్యక్తులకు అమ్మాడు. ప్లాటును ఆక్రమించారని గుర్తించిన రాజయ్య కొడుకు మహేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మారం శ్రీనివాస్, ఆరేటి గంగాధర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

కామారెడ్డి అశోక్‌నగర్‌లో నివసించే నరాల జీవన్‌రెడ్డికి చెందిన 200 గజాల ప్లాటును ట్రాక్టర్‌తో ఇతరులు చదును చేస్తుంటే వెళ్లి నిలదీశాడు. నిజామాబాద్‌కు చెందిన అబ్దుల్ మోసీ ప్లాట్‌ను కొనుగోలు చేశాడని కొన్ని పత్రాలు చూపించాడు. ఆ పత్రాల్లో తాను 2012లో చనిపోయినట్టు, తన కూతురుగా బగ్గాలి స్రవంతి అని పేర్కొనడాన్ని చూసి జీవన్‌రెడ్డి షాక్ అయ్యాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా నిజామాబాద్‌లో డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్న షేక్ అహ్మద్ నబీ, షకీల్ ఫెరోజ్, ఖాజా అబ్బాస్ అహ్మద్ ఉస్మాన్ కలిసి జీవన్‌రెడ్డి ప్లాటును కాజేశారని గుర్తించారు. అతను చనిపోయినట్లు వేరేవారి డెత్ సర్టిఫికెట్‌ను మార్ఫింగ్ చేసి బగ్గాలి స్రవంతి అనే మహిళను జీవన్‌రెడ్డి కూతురుగా తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేయించినట్లు తేల్చారు. ఆ భూమిని వేరేవాళ్లకు విక్రయించడం కోసం చదును చేయిస్తుండగా విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో మహ్మద్ అబ్దుల్ మోసీ, బగ్గాలి స్రవంతి, షేక్ అహ్మద్ నబీలను అరెస్టు చేశారు.

- నకిలీ పత్రాలతో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు
- కామారెడ్డిలో కబ్జారాయుళ్ల తెగింపు
- నష్టపోతున్న సామాన్యులు
- పట్టించుకోని అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఖాళీ జాగా కనిపిస్తే చాలు వారు కన్నేస్తారు. నకిలీ పత్రాలతో ఆ ప్లాట్లను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. బతికి ఉన్న భూమి యజమాని చనిపోయినట్లు సర్టిఫికెట్లు సృష్టిస్తారు. వారికి సంబంధం లేని వారిని తీసుకొచ్చి వీరే వారి వారసులని చెప్పి రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. ప్లాటు యజమానికి విషయం తెలిసి నిలదీస్తే తాము కొనుగోలు చేశామని బుకాయిస్తారు. గట్టిగ అడిగితే ''మా దగ్గర అన్నీ ఉన్నాయి. మా వెనుకెవరున్నరో తెల్వదా మీకు'' అంటూ దబాయిస్తారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఒక్కోసారి పోలీసులు బాధితుల సమస్యలను విని కబ్జాదారుల ఆటకట్టిస్తున్నారు. ఎవరైనా పెద్ద తలకాలయలు వెనుక ఉంటే మాత్రం సివిల్ తగాదాలో తలదూర్చలేమంటూ పక్కకు తప్పుకుంటున్నారు. మూడు, నాలుగు జిల్లాలకు కూడలి అయిన కామారెడ్డి పట్టణం జిల్లా ఏర్పడక ముందే వ్యాపార, వాణిజ్య కేంద్రంగా ఎదిగింది. జిల్లా అయిన తర్వాత మరింత విస్తరిస్తోంది. ఇక్కడ ప్లాట్ల ధరలు ఆకాశాన్నంటాయి. ధరలతో పాటు వివాదాలూ పెరిగాయి.

పక్కా ప్లాన్‌తో..

కామారెడ్డి పట్టణంలోని కాలనీల్లో ఎక్కడైనా ప్లాటు ఖాళీగా ఉండి, చాలా రోజులుగా అటువైపు ఎవరూ రానివాటిపై అక్రమార్కులు కన్నేస్తారు. ఇరుగుపొరుగు వారి ఇళ్ల నంబర్లు, ప్లాట్ల నంబర్ల వివరాలు సేకరిస్తారు. వాటి ఆధారంగా ఆ ఖాళీ ప్లాటు ఎన్ని గజాలు, ఎవరి పేరిట ఉందో తెలుసుకుంటారు. యజమాని ఎక్కడ ఉంటాడు? ఆయన బతికే ఉన్నాడా? ఆయనకు పిల్లలు ఎక్కడుంటారన్న వివరాలు సేకరించి పక్కా స్కెచ్ వేస్తారు.

ఆ సమాచారం ఆధారంగా ప్లాటు యజమాని చనిపోయి ఉంటే వారసుల వివరాలు సేకరించి వారిపేరుతో యజమాని డెత్‌సర్టిఫికెట్లు, డిపెండెంట్ సర్టిఫికెట్లు తయారు చేయిస్తారు. వాటి ఆధారంగా వారసులుగా తమ వారిని చూపించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. యజమాని దూర ప్రాంతాల్లో ఉన్నాడంటే చాలు ఆయన చనిపోయినట్టు పత్రాలు తయారు చేస్తారు. వారసులుగా ఎవరినో ఒకరిని చూయించేసి పని కానిచేస్తారు. మరికొన్ని ఘటనల్లో ప్లాటు ఖాళీగా ఉంటే ఇరుగు పొరుగు ఇళ్ల యజమానులతో కలిసి కొందరు కుట్రకు తెరలేపుతారు. ఆ ప్లాటులోకి పక్క ఇంటి యజమాని తొలుత ఎంటరై చిన్న చిన్న నిర్మాణాలు మొదలుపెడతాడు. యజమానులు ఎవరూ రాలేదంటే ఏదోరకంగా పత్రాలు రెడీ అవుతాయి. ఒకరి నుంచి మరొకరికి ఇలా రెండు, మూడు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. అసలు యజమాని వచ్చేసరికి అక్కడ ప్లాటు గయాబ్ అవుతుంది.

నకిలీ డాక్యుమెంట్ల తయారీ

జిల్లా కేంద్రంలో కొన్ని ముఠాలు నకిలీ డాక్యుమెంట్లను రూపొందించి అక్రమాలకు తెరలేపుతున్నాయి. ప్లాటు యజమాని కొనుగోలు చేసిన తేదీ కన్నా రెండు, మూడేళ్ల ముందే తాము కొనుగోలు చేసినట్లు పత్రాలు రూపొందిస్తున్నారు. తామే ముందు కొనుగోలు చేశామని చెప్పడం ద్వారా ప్లాటు యజమానిని డైలమాలో పడేస్తారు. బాధితుడు తనకు న్యాయం చేయమంటూ అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి మాట్లాడితే కూర్చొని సెటిల్ చేసుకోమనే ఉచిత సలహా వస్తోంది. కష్టపడి కొనుగోలు చేసిన ప్లాటును గద్దల్లా తన్నుకుపోతుంటే ఏమి చేయలేక ఇచ్చినంత తీసుకొని బాధితులు ఊరుకుంటున్నారు.

తిలా పాపం తలా పిడికెడు

కామారెడ్డి పట్టణంలో ప్లాట్ల కబ్జాలు, తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వ్యవహారంలో అందరి పాత్ర ఉంటోంది. స్థానికంగా ప్రజాప్రతినిధులు, కొందరు నాయకులు, అధికారులు, దళారులంతా కలిసి చేస్తున్న భాగోతంలో సామాన్యుడు సమిధవుతున్నాడు. ప్లాటు రిజిస్ట్రేషన్ విషయంలో అధికారులు కనీస నియమాలు పాటించడం లేదన్నది జరిగిన ఘటనల్లో స్పష్టమవుతుంది. నేరుగా రిజిస్ట్రేషన్‌కు వెళితే రకరకాల కొర్రీలు పెట్టే అధికారులు, దళారులతో కలిసి వెళితే డాక్యుమెంట్లు ఒరిజినలా, కాదా అన్నది కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. పోలీసులు అక్రమ రిజిస్ట్రేషన్లతో ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నారు. అయితే వారి వెనక ఉన్నది ఎవరన్నది తేలిస్తేగానీ అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు ఆగేట్టు కనిపించడం లేదు. లోతుగా దర్యాప్తు జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జోరుగా గంజాయి దందా!

- బీబీపేట అడ్డాగా విక్రయాలు
- బానిసవుతున్న యువత
- పట్టించుకోని అధికారులు

బీబీపేటకు చెందిన ఓ పాఠశాల విద్యార్థి గంజాయికి అలవాటు పడ్డాడు. ఇతర విద్యార్థులకు మత్తు అలవాటు చేశాడు. ఆ విద్యార్థి ప్రవర్తనను గమనించిన ఉపాధ్యాయులు మందలించారు. తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి, ఆ విద్యార్థి కి టీసీ ఇచ్చి ఇంటికి పంపించారు.



బీబీపేట: బీబీపేటలో గంజాయి దందా జోరుగా సాగుతోంది. మండల కేంద్రం అడ్డాగా ఇతర గ్రామాలకు గంజాయి సరఫరా చేస్తున్నారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు నగరానికి చెందిన వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని గంజాయిని తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేగాకుండా మండల కేంద్రంలో పాన్ షాపుల్లో గంజాయితో పాటు డ్రగ్స్ అమ్మకాలు సాగుతున్నట్లు సమాచారం. పాన్‌షాపుల్లో హుక్కా పాట్‌లను కిరాయికి ఇస్తూ గంజాయి కూడా సరఫరా చేస్తున్నారు. దీంతో విద్యార్థులు గంజాయికి బానిసలు అయి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.

రోడ్లపై హంగామా

మత్తు పదార్థాలకు బానిసైన యువత ఆ మత్తులో రాత్రిపూట నానా హంగామా చేస్తున్నారు. బైక్‌లపై వేగంగా వెళ్తూ ఇతరులను ఇబ్బంది పెడుతున్నారు. బస్టాండ్, పెద్ద చెరువు, ప్రధాన రహదారిపై పార్టీల పేరుతో హంగామా సృష్టిస్తున్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. ఇటీవల మండలంలోని తుజాల్‌పూర్, యాడారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు గంజాయితో ఉండగా భిక్కనూరు పోలీసులు పట్టుకున్నారు. గత నెలలో బీబీపేటకు చెందిన వ్యక్తి నిజామాబాద్‌లో గంజాయితో పట్టుబడ్డారు. ఇంత జరుగుతున్నా మండల పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

నిరాశాజనకంగా నీటిమట్టం

- నిండని చెరువులు, కుంటలు
- వెలవెలబోతున్న ప్రధాన జలాశయాలు
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు



నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగవుతున్న వరి



నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

నిజాంసాగర్: వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు పూర్తి కావొస్తున్నా చెరువులు, ప్రాజెక్టుల్లోకి భారీ ప్రవాహాలు వచ్చి చేరలేదు. జలాశయాల్లోకి ఆశించిన స్థాయిలో నీరు రాకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్‌లో కురిసిన వర్షాలకు కుంటలు, చెరువుల్లోకి కొత్త నీరు అంతంత మాత్రంగానే చేరింది. నిజాంసాగర్, కౌలాస్ నాలా ప్రాజెక్టుల్లోకి వరదలు రాకపోవడంతో అవి వెలవెలబోతున్నాయి. నెల రోజుల నుంచి కురిసిన వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 0.8 టీఎంసీల నీరు మాత్రమే వచ్చింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1405 (17.8 టీఎంసీలు) అడుగులకు ప్రస్తుతం 1389.55 (3.86 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది. అలాగే జుక్కల్ మండలంలోని కౌలాస్ నాలా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 458 మీటర్లు(1.237 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 454.7 మీటర్లు 0.580 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జిల్లాలో వీటితో పాటు పోచారం, సింగితం రిజర్వాయర్‌లు ఉన్నాయి. అయితే సింగితం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటితో నిండుకుండలా మారి అలుగు దూకుతుంది. పోచారం ప్రాజెక్టులో నీటిమట్టం ఆశాజనకంగా ఉంది.

చెరువుల్లోనూ అంతంతమాత్రమే..

జిల్లాలో 1,515 కుంటలు, చెరువులు ఉండగా సగానికి పైగా నీళ్ల లేక బోసిపోతున్నాయి. 674 చెరువుల్లో 25 శాతం లోపు నీరు ఉంది. 463 చెరువులు 25-50 శాతంలోపు నీటితో ఉన్నట్లు నీటిపారుదలశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. 130 చెరువులు 50-75 శాతం మేరా నిండాయి. 105 చెరువుల్లో మాత్రం 75 నుంచి 100 శాతం నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 53 చెరువులు మాత్రం ఇటీవల కురిసిన వర్షాలకు అలుగు పారాయి.

'ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలి'

కామారెడ్డి అర్బన్ : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కామారెడ్డి రోటరీ క్లబ్, చేనేత, జౌళిశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం చేనేత చైతన్య నడక నిర్వహించారు. హ్యాండ్లూం ఏడీ సంతోష్ కుమార్, రోటరీ అధ్యక్షుడు పి.రాజనర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరు వారానికి ఒకసారైనా చేనేత వస్త్రాలు ధరించాలని, దీంతో నేత కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్మికులకు చేనేత వస్త్రాలను అందజేశారు. అనంతరం స్థానిక రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు పి రాజనర్సింహారెడ్డి, కార్యదర్శి కే.సత్యనారాయణ, కోశాధికారి సబ్బని కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

పిట్లంలో..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం వద్ద బుధవారం చేనేత కార్మికుల దినోత్సవాన్ని సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. మండల చేనేత సంఘం సభ్యులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో చేనేత నడకలో అధికారులు

'పోచారం'లోకి స్వల్ప ఇన్‌ఫ్లో



పోచారం ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం



సింగితం రిజర్వాయర్ గేటు నుంచి విడుదలవుతున్న నీరు

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం 15అడుగులకు చేరింది. ఎగువన కురుస్తున్న వర్షానికి లింగంపేటవాగు ద్వారా ప్రాజెక్టులోకి 300క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

కొనసాగుతున్న సింగితం నీటి విడుదల

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్‌లోకి బుధవారం 425 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. రిజర్వాయర్ 416.550 మీటర్ల పూర్తి స్థాయి నీటిమట్టంతో నిండుకుండలా ఉంది. దీంతో రిజర్వాయర్ గేటు ద్వారా ప్రధాన కాలువకు 425 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు నీటి పారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు.

'స్వచ్ఛదనం'లో ప్రజలను భాగస్వాములు చేయాలి



దోమకొండలో మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

దోమకొండ: స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం దోమకొండతో పాటు లింగుపల్లి, సంగమేశ్వర్ గ్రామాల్లో అయన పర్యటించారు. దోమకొండలో చేనేత జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత సహకార సంఘంతో పాటు గడికోట ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగులకు సరైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం బీసీ హాస్టల్, ఐసీడీఎస్‌తో పాటు పశు వైద్యశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఎస్సీ హాస్టల్ వద్ద మొక్కలు నాటారు. జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గడికోటను సందర్శించి ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీని అడిగి కోట గురించి తెలుసుకున్నారు. డీఆర్‌డీవో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఆస్పత్రుల సమన్వయకర్త విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్ రావు, డీఎల్‌పీవో వెంకట శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ సంజయ్‌రావు, ఏవో పవన్, ఏఈలు శిరీష, బాలకృష్ణ, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.



దోమకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరిస్తాం



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నెల కొన్న సమస్యలను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు దృష్టికి తీసుకెళ్తామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే చొరవతో సంపూర్ణ పారిశుధ్య పనులు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం, వంటశాల, ప్రహరి నిర్మాణ పనులు చేపడ్తామన్నారు. కస్తూర్బా ప్రిన్సిపాల్ సరోజన తదితరులు ఉన్నారు.

చెట్ల తొలగింపు పనులు ప్రారంభం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారంలో వందేళ్లనాటి మహావృక్షాల తొలగింపు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రస్తుతమున్న హెచ్ఎంబీ(హైదరాబాద్-మెదక్-బోధన్) రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. కాగా రోడ్డుకు ఒక వైపు ఉన్న పోచారం ప్రాజెక్టు కట్టపై ఉన్న చెట్లను తొలగించడంతో పాటు కట్టను ధ్వంసం చేశారనే కారణంతో ఇరిగేషన్ సిబ్బంది ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులను నిలిపివేశారు. జాయింట్ సర్వే చేసిన అనంతరం విస్తరణ పనులు చేపట్టాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులకు సూచించారు.

సమ్మెను విజయవంతం చేయాలి

కామారెడ్డి రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈనెల 8న చేపట్టిన ఒక్కరోజు సమ్మెను జయప్రదం చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు జీపీ వర్కర్స్‌ను పర్మినెంట్ చేసి వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలు పరిష్కారం కోసం గురువారం ఒకరోజు సమ్మె చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు బాలనర్సు, రాజన్న, మల్లేశ్, శ్యాం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) :కాంగ్రెస్ నమ్మిన రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని మాజీ జెడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్ రావు సూచించారు. బుధవారం మండలంలోని పద్మాజివాడి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొంత మంది రైతులకు మాత్రమే రుణమాఫీని వర్తింపజేయడం సబబు కాదన్నారు. రైతులందరికీ రుణ మాఫీ చేయకుంటే సెప్టెంబర్‌లో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కుప్రియాల సాయాగౌడ్, మల్లయ్య పాల్గొన్నారు.

నియామకం



ఎల్లారెడ్డిరూరల్ (ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షులు, కార్యదర్శి దామోదర్‌రెడ్డి, కుశాల్‌లు బుధవారం తెలిపారు. జెడ్పీ బాలికల పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎల్లారెడ్డి పీఆర్‌టీయూ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. అసోసియేట్ అధ్యక్షుడిగా వేణుగోపాల్, ఉపాధ్యక్షురాలిగా మాధురి, ప్రధాన కార్యదర్శిగా వినయ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా విజయ్‌కుమార్, గంగమణిని ఎన్నుకున్నారు.

కాపర్ కేటుగాళ్లు..

- వ్యవసాయ భూముల్లోని ట్రాన్స్‌ఫార్మర్లకు భద్రత కరువు
- చోరీకి గురవుతున్న కాపర్ వైరు
- విద్యుత్ శాఖ, రైతులకు నష్టమే..
- పట్టించుకోని పోలీసులు



ఏఆర్పీ గ్రామంలో ఎస్సై వంశీధర్‌రెడ్డితో మాట్లాడుతున్న రైతులు(ఫైల్)



ఎడపల్లి శివారులో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

ఎడపల్లి: కన్నేశారా చోరీ చేయాల్సిందే. కటిక చీకట్లలోనూ కాపర్ కొట్టేయాల్సిందే. కాదూ కూడదంటే విద్యుత్ వైర్లనయినా దిగమింగేయాల్సిందే.. ప్రాణాంతకమని తెలిసినా విద్యుత్ వైర్లతో సయ్యాట లాడతారు. అర్ధరాత్రి మొదలు కోడి కూసే లోపు గప్‌చప్‌గా ఎత్తుకుపోతారు. పాత ట్రాన్స్‌ఫార్మర్లపై కన్నేసే దుండగులకు ఊరికి దూరంగా ఉన్న పొలాలే టార్గెట్. 10-20 ఏళ్ల కింద అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లయితే అందులో 10 నుంచి 14 కేజీల దాకా కాపర్ దొరుకుతుంది. మార్కెట్‌లో దాని విలువ సుమారు రూ. 2500 ఉంటుంది. కొత్తవాటిలో ఉన్న కాపర్ వైరుకు మార్కెట్‌లో రూ. పదివేల వరకు ఉంటుంది. దీంతో దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తున్నారు. రూ. లక్షలు పోసి పంట బాగుకు కొన్న ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం అవుతుండడంతో బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఎడపల్లి మండలంలోని గడిచిన నెల రోజుల వ్యవధిలో దుండగులు పది ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లను దొంగిలించారు. దీంతో రైతులకు, విద్యుత్ శాఖకు విపరీతమైన నష్టం వాటిల్లుతోంది. తాజాగా సోమవారం రాత్రి ఎడపల్లి శివారులో మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైర్లను ఎత్తుకెళ్లారు. ఇలా నెల రోజుల వ్యవధిలోనే మండలంలోని ఠానాకలాన్, పోచారం, కుర్నాపల్లి, దూపల్లి గేట్ ప్రాంతాల్లోని పది ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ విలువ సుమారు రూ. లక్ష ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. జరిగిన 15 ఘటనలను పరిశీలిస్తే రూ. 15 లక్షలు విద్యుత్‌శాఖకు, రైతులకు నష్టం వాటిల్లిందనే చెప్పొచ్చు. మండలంలోని ఏఆర్పీ గ్రామానికి వచ్చిన ఎస్సై వంశీధర్‌రెడ్డికి స్థానిక రైతులు సమస్యను విన్నవించారు.

ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తున్న వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

న్యాయవాదులపై దాడిని ఖండిస్తున్నాం



కామారెడ్డిలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కామారెడ్డి క్రైం : జనగామలో న్యాయవాద దంపతులపై జరిగిన దాడిని నిరసిస్తూ కామారెడ్డి న్యాయవాదులు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి కోర్టు విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణం ఎదుట ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. జనగామ పోలీసుల చర్యను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో న్యాయవాదులపై దాడులు చేయడం పోలీసులకు పరిపాటిగా మారిందన్నారు. ఈ విషయమై సదరు పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాదులు జగన్నాథం, శంకర్ రెడ్డి, అన్వర్ షరీఫ్, సిద్ధి రాములు, శ్యామ్ గోపాల్, బిక్షపతి, అమృత రావు, అతిమాముల శ్రీధర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయవాదులు బుధవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. జనగాం జిల్లాలో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడులకు నిరసనగా వారు విధులను బహిష్కరించారు. న్యాయవాద దంపతులపై, దాడులకు పాల్పడిన వారిపై చర్యలను తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణకు రక్షణ చట్టం అమలు చేయాలని కోరారు. న్యాయవాదులు నవీద్, పండరి, సతీశ్, శ్రీనివాస్, గోపాల్‌రావు, సాయిబాబా, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో..

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

- మధ్యాహ్న ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్..

మాచారెడ్డి : 'మధ్యాహ్న భోజనం తినలేం' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా ఆహార తనిఖీ అధికారిణి సునీత స్పందించారు. ఈ మేరకు ఆమె ఘన్‌పూర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వహిస్తే అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, హెచ్‌ఎంకు ఏజెన్సీ నిర్వాహకులను తొలగించి కొత్త వారిని పెట్టుకునే అధికారం ఉందన్నారు. మెనూ ప్రకారం భోజం పెట్టాలని సూచించారు. ఆహారంలో పురుగులు రావడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిగిన ఘటనపై వివరణ ఇవ్వాలని హెచ్ఎం మంజు రాణిని ఆదేశించారు.



ఘన్‌పూర్ పాఠశాలను తనిఖీ చేస్తున్న జిల్లా ఆహార శాఖ అధికారిణి సునీత

ఏఎంసీ చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు

నిజాంసాగర్(జుక్కల్): పిట్లం-నిజాంసాగర్ మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. బుధవారం మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును మాగి గ్రామ కాంగ్రెస్ నాయకులు కలిశారు. గ్రామానికి చెందిన చీకోటి మనోజ్ పటేల్‌కు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. రెండు మండలాలకు సంబంధించిన మార్కెట్ కమిటీ కావడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో చర్చించి చైర్మన్ పదవికి నాయకుడిని ఖరారు చేస్తామని ఎమ్మెల్యే నాయకులతో పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో చీకోటి మనోజ్‌పటేల్, గుర్రపు శ్రీనివాస్, వెంకటేశం, జగన్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేతో మాగి గ్రామ నాయకులు

నేడు రైతు రుణమాఫీపై రచ్చబండ

కామారెడ్డి రూరల్ : కిసాన్ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు అర్హులైన రైతులకు అందరికీ రూ. 2లక్షల వరకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న కామారెడ్డి మండలం ఇస్రోజీవాడిలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణాతార తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి హాజరవుతారన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి అర్బన్: బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కమిటీని నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అధ్యక్షుడిగా కాటిపల్లి భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బాయికాడి ఆనంద్‌రెడ్డి, బానాల మహిపాల్‌రెడ్డి, ఎస్ నారాయణరెడ్డి, మేడిపల్లి నర్సింలు, ప్రధాన కార్యదర్శులుగా దేవిరెడ్డి గంగారెడ్డి, మోహన్, కార్యదర్శులుగా జలేందర్‌రెడ్డి, అన్నారం వెంకట్‌రెడ్డి, దుర్గం సంజీవరెడ్డి, రాజిరెడ్డి, కోశాధికారిగా ఎస్.సుధాకర్ రెడ్డి, అధికార ప్రతినిధిగా జే.లింగారెడ్డి, 14 మందిని కార్యవర్గసభ్యులుగా నియమించారు.

పుస్తకం ఒక దిక్సూచి లాంటిది



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల చరిత్ర అధ్యాపకులు అంకం జయప్రకాష్ రాసిన 'తెలంగాణ ఉద్యమం -రాష్ట్ర ఆవిర్భావం' గ్రూప్-1 మెయిన్స్ రాసే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ప్రిన్సిపల్ కే.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం రచయిత జయప్రకాష్ కళాశాల గ్రంథాలయానికి అందజేసిన తెలంగాణ ఉద్యమం-రాష్ట్ర ఆవిర్భావం పుస్తకాలను ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కే.కిష్టయ్యలు ఆవిష్కరించారు. పుస్తకం పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు ఒక దిక్సూచిలా ఉంటుందని రచయత జయప్రకాష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ లక్ష్మణాచారి, ఎన్‌సీసీ అధికారి సుధాకర్, అధ్యాపకులు జి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో తనిఖీలు



బాన్సువాడ రూరల్ : బాన్సువాడ మండలంలోని పలు రైస్‌మిల్లుల్లో బుధవారం కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బాన్సువాడ ఆర్డీవో రమేష్ రాథోడ్, సివిల్ సప్లయ్ ఇన్‌చార్జి డీఎం నిత్యనందంతో కలిసి మండలంలోని బుడిమి గ్రామంలో ఉన్న విష్ణురైస్ మిల్, తాడ్కోల్‌లోని వెంకటేశ్వర రైస్‌మిల్, దేశాయిపేట్‌లోని ఉమామహేశ్వర్ రైస్‌మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. కేటాయించిన స్టాక్ రిజిష్టర్ ప్రకారం గ్రౌండ్ స్టాక్‌ను సరిచూశారు. గడువులోపు సీఎంఆర్ పూర్తి చేయాలన్నారు.

ఎట్టకేలకు తరగతులు ప్రారంభం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎట్టకేలకు బుధవారం తరగతులు ప్రారంభమయ్యాయి. ఆరురోజులుగా కళాశాలలో తరగతులు జరగకపోవడంతో విద్యార్థులు మంగళవారం రోడ్డెక్కి ఆందోళన చేసిన విషయం విధితమే. ఈ మేరకు జిల్లా అధికారులు స్పందించి ఎల్లారెడ్డి కళాశాల నుంచి నాగయ్య(ఫిజిక్స్), పిట్లం కళాశాల నుంచి విష్ణు(ఎకానామిక్స్)ను నాగిరెడ్డిపేట కళాశాలకు పంపారు. వీరిని మూడురోజులపాటు నాగిరెడ్డిపేట కళాశాలలో విద్యార్థులకు పాఠాలను బోధించాలని ఆదేశించారు. ఎట్టకేలకు కళాశాలలో తరగతులు ప్రారంభంకావడంపై విద్యార్థులు కొంతమేర ఊరట చెందుతున్నారు. కాని తమకు రెగ్యులర్‌గా తరగతులు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని వారు వేడుకుంటున్నారు.



పాఠాలు బోధిస్తున్న అధ్యాపకుడు

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి

మద్నూర్(జుక్కల్) : రహదారి భద్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని నేషనల్ హైవే ఇన్సిడెంట్ మేనేజర్ సౌరభ్ ప్రతాప్‌సింగ్ సూచించారు. మండలంలోని మేనూర్‌లో జాతీయ రహదారి 161పై ఉన్న మోడల్ స్కూల్, కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. పాదచారులు రోడ్డు దాటే సమయంలో జీబ్రా క్రాసింగ్ వద్దే రోడ్డు దాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘటన మేనేజర్ మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్, సెఫ్టీ మేనేజర్ బాల్‌రాజ్, హైవే పెట్రోలింగ్ బృందం తదితరులున్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మంచంపట్టిన భవానీపేట తండా



మాచారెడ్డి:పాల్వంచ మండలం భవానీపేట తండాలో ప్రజలు జ్వరాలతో మంచం పట్టారు. 20 రోజులుగా తండావాసులు జ్వరం, ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గుతో ఇబ్బందులు పడుతున్నారు. వంద మందికి పైగా జ్వరాలతో అస్వస్థతకు గురైనప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని తండావాసులు ఆరోపించారు. బుధవారం ఏడుగురు జ్వర పీడితులను అంబులెన్స్‌లో కామారెడ్డి తరలించారు. అధికారులు స్పందించి మెరుగైన వైద్యం అందించాలని తండావాసులు కోరుతున్నారు.

హామీలను నెరవేర్చాలి



కామారెడ్డి రూరల్ : రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐఎఫ్‌డీడబ్ల్యూ (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య) ఆధ్వర్యంలో తహసీల్దార్ జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పెంచిన పెన్షన్లను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు నీలా, పట్టణ అధ్యక్షురాలు సుజాత, పట్టణ కార్యదర్శి భార్గవి, జిల్లా నాయకురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

చెట్టును ఢీకొన్న బైక్ ఘటనలో ఒకరు..

సిరికొండ: మండలంలోని కొండూర్ సమీపంలో చెట్టును బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన వాగ్మరే రాజు(32) పదేళ్లుగా పెద్దవాల్గోట్‌లో మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి అతని స్నేహితుడు వీరనర్సింహారెడ్డితో కలిసి బైక్‌పై పెద్దవాల్గోట్ నుంచి సిరికొండ వైపు వెళ్తున్నారు. కొండూర్ సమీపంలో వీరి బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో రాజు తలకు తీవ్రగాయం కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న వ్యక్తికి గాయాలయ్యాయి. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలున్నారు. ఘటన స్థలాన్ని ధర్పల్లి ఎస్సై విక్రం, ఏఎస్సై దుర్గాప్రసాద్, ఎస్‌హెచ్‌వో మధుకర్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు..

భిక్కనూరు: మండలంలోని కంచర్లలో విద్యుత్‌షాక్‌తో ఓ రైతు మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన మట్టి స్వామి(37) అనే రైతు తన పొలంలో పంటకు నీరు పెట్టేందుకు మంగళవారం సాయంత్రం వెళ్లాడు. రాత్రి 10 అయినా ఇంటికి రాకపోవడంతో తండ్రి లింగారెడ్డి కుటుంబీకులతో కలిసి పొలానికి వచ్చి చూడగా మృతి చెంది ఉన్నాడు. స్టార్టర్ బాక్స్‌లో వైరు సరిచేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నవీపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న నవీపేటకు చెందిన పల్లె నారాయణ(65) బుధవారం మృతి చెందాడు. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న రోడ్డుపై కాలినడకన వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొందన్నారు. తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాధవనగర్‌లో మరొకరు..

నిజామాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మాధవనగర్ చెందిన శాకంపల్లి నారాయణరెడ్డి(65) బుధవారం మృతి చెందాడు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మాధవనగర్ చెందిన నారాయణరెడ్డి గత నెల 25న రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా మాధవనగర్ నుంచి వినాయకనగర్ వెళ్తున్న ఓ బైక్ ఆయనను ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ నారాయణరెడ్డిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన బైక్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

లేగదూడపై చిరుత దాడి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు



చిరుత పాదముద్ర

డిచ్‌పల్లి: మండలంలోని యానంపల్లి శివారులో ఉన్న పశువుల కొట్టంలో లేగదూడపై చిరుత దాడి చేసింది. ఇందల్వాయి అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోట మనోజ్‌కుమార్ పశువుల కొట్టంలో లేగదూడపై మంగళవారం రాత్రి చిరుత దాడి చేసింది. ఉదయం లేచి చూసే సరికి లేగదూడ మరణించి ఉండటం, చిరుత అడుగులు కనిపించడంతో అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వినయ్, శ్రీకాంత్ గ్రామానికి చేరుకుని పశువుల కొట్టాన్ని పరిశీలించారు. మట్టిలో ఉన్న పాదముద్రలను బట్టి చిరుతనే అని ప్రాథమికంగా నిర్ధారించారు. అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నందున రైతులు, ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అటవీ సిబ్బంది సూచించారు. చిరుత సంచారంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ అధికారులు స్పందించి చిరుతను పట్టుకుని దూరంగా వదిలేయాలని స్థానికులు కోరుతున్నారు.

పంట ధ్వంసం.. మహిళా రైతుపై దాడి

మాచారెడ్డి: అటవీ శాఖలో అక్రమంగా సాగు చేస్తున్న పంటను సంబంధిత అధికారులు బుధవారం ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన మహిళా రైతుపై దాడి చేసిన ఘటన పాల్వంచ మండలం ఇసాయిపేట సమీపంలోని ఒడ్డె గూడెంలో చోటుచేసుకుంది. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ, నాయకులు గూడెంను సందర్శించి మాట్లాడారు. ఒక మహిళ అని చూడకుండా దాడి చేయడం సరైందని కాదన్నారు. 50 ఏళ్లుగా సాగు చేస్తూ 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం అక్కడ జీవిస్తున్న రైతులు ఆ భూమిని సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రైతులపై దాడి చేసి పంటను ధ్వంసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్ర కాశ్, సురేష్, రైతులు రాములు, శ్రీకాంత్, లక్ష్మి, సరిత, సాయవ్వ, వెంకటి, శ్రీను, మల్లవ్వ ఉన్నారు.



ధ్వంసమైన పైప్‌లైన్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ State Board. ద్వారా INTER పూర్తి Andhra University ద్వారా BA.,B.Com. ONLINE Admission, ONLINE EXAMS. పై చదువులకు, ప్రభుత్వ ఉద్యోగాలకు, ప్రమోషన్లకు అర్హులు. అడ్మిషన్ల వివరాలకు. ☎ 94402 29907 [Z-795587]

SERVICES

■ వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్: 9501065342 [T-270]

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీతం 18K ఫోన్: 9160900024, 9640400073 [H-796264]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

డ్రంకన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో ముగ్గురికి 15 రోజుల జైలు శిక్షను మెజిస్ట్రేట్ విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. బుధవారం మద్యం తాగి వాహనం నడిపిన 37 మందికి ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ కౌన్సిలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. కౌన్సెలింగ్ తర్వాత వీరిని కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ 34 మందికి రూ. 89 వేల జరిమానా విధించారు. జక్రాన్‌పల్లికి అజ్మీరా గణేశ్, ఎడపల్లికి చెందిన మహమ్మద్ షౌకత్ అలీ, డిచ్‌పల్లికి చెందిన భగవత్ మోజీరామ్‌లకు జైలు శిక్ష విధించారు.

ఒకరిపై కేసు నమోదు

ఇందల్వాయి: పోలీస్‌స్టేషన్‌లో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు చేసినట్లు ఎస్సై మనోజ్ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సిర్నపల్లికి చెందిన వడ్ల నాగరాజు తన తమ్ముడికి చెందిన ఓ కేసు విషయంలో స్టేషన్‌కి వచ్చి సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించిన నేరం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

ధర్పల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై విక్రం బుధవారం తెలిపారు. గత నెల 31న ఇంటి నుంచి వెళ్లిన వివాహిత తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించి నా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని ఓ రైస్‌మిల్‌పై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించి సుమారు 270 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. రైస్‌మిల్‌కు మహారాష్ట్ర నుంచి బియ్యం లోడ్‌తో వచ్చినట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి, సీఐ పురుషోత్తం బుధవారం తెలిపారు. అనంతరం సివిల్ సప్‌లై అధికారులకు సమాచారం అందించారు.పోలీసులు బియ్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

మద్యం మానేయమన్నందుకు ఆత్మహత్య

ఖలీల్‌వాడి: మద్యం మానేయమన్నందుకు ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్ మండలం బీమదేవరపల్లికి చెందిన జింక శ్రీకాంత్(36) బతుకుదెరువు నిమిత్తం భార్య, పిల్లలతో కలిసి జిల్లా కేంద్రంలోని జెండాగల్లీలో నివాసం ఉంటున్నారు. శ్రీకాంత మద్యానికి అలవాటు పడడంతో కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. మంగళవారం రాత్రి సైతం మందు తాగొద్దు అన్నందుకు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.